క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం



అమ్మవారికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి ఆలయంలో అమ్మవారి ఆదివారం క్షీరాభిషేకం నిర్వహించారు. ప్రతీ ఆదివారం మాదిరిగానే ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్ నేతృత్వంలో అమ్మవారికి క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు.

పంపిణీకి సిద్ధంగా 20వేల మొక్కలు



పంపిణీకి సిద్ధంగా ఉన్న వివిధ రకాల మొక్కలు

బొండపల్లి: స్థానిక వనమిత్ర కేంద్రంలో మొక్కలను తక్కువ ధరకు రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేశామని వనమిత్ర కేంద్రం అధికారి అప్పలరాజు ఆదివారం తెలిపారు. ఈ వనమిత్ర కేంద్రంలో ఉపాధి హామీ నిధులతో 10 వేల మొక్కలను , అటవీ శాఖ కంపర్స్ నిధులతో మరో పదివేల మొక్కలను ఏడాది కాలంగా ఇక్కడ పెంచుతున్నామని చెప్పారు. రైతులకు అవసరమైన కానుగ,బాదం, వేప, నేరుడు తదితర రకాల మొక్కలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. కావాల్సిన రైతులు ముందుగా ఆధార్ కార్డు తీసుకుని వచ్చి నామమాత్రపు నగదును చెల్లిస్తే మొక్కలు అందిస్తామని పేర్కొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణం



వేపాడలోని బీసీ కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డు

వేపాడ: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో సీసీ రోడ్డును అధికారులు నిర్మించారు. ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఇటీవల ఈ ప్రాంతంలో 'గడపగడపకు మనప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించిన సమయంలో ఇక్కడి ప్రజలు సీసీ రోడ్డు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే స్పందించి 35 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణానికి సచివాలయానికి కేటాయించిన 'గడప గడపకు మన ప్రభుత్వం' నిధుల నుంచి లక్ష మంజూరు చేశారు.ఈ నిధులతో రోడ్డు వేశామని సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ విజయ్ తెలిపారు.

కొత్తబగ్గాంలో పారిశుద్ధ్య పనులు



పూడిక తొలగిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

గజపతినగరం రూరల్: మండలంలోని కొత్త బగ్గాం గ్రామంలో సచివాలయ కార్యదర్శి శ్రీను పర్యవేక్షణలో ఆదివారం పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. గ్రామంలోని అన్ని వీధి కాలువుల్లో పేరుకుపోయిన చెత్త, పూడికను కార్మికులు తొలగించారు. అనంతరం గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రత, తడి, పొడి చెత్తను వేర్వేరుగా గ్రీన్ అంబాసిడర్లకు అందించే విధానంపై స్థానిక వలంటీర్లతో కలిసి అవగాహన కల్పించారు.

నేడు పీఏసీఎస్ భవనాల ప్రారంభం



పీఏసీఎస్ నూతన భవనాలు

గుర్ల: మండలంలోని గూడెం పీఏసీఎస్ (ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం) భవనాలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సోమవారం ప్రారంభించనున్నారని పీఏసీఎస్ అధికారులు, మండల వైఎస్సార్ సీపీ నాయకులు ఆదివారం తెలిపారు. గూడెం పీఏసీఎస్‌ను ఇన్నాళ్లు అద్దెభవనాల్లో నిర్వహించారు. మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చొరవతో సొసైటీకి సొంత భవనాల నిర్మాణానికి రూ.44 లక్షలు మంజూరయ్యాయి. గూడెం జంక్షన్ వద్ద భవనాల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేశారు.

40 ఎకరాల్లో పంట నష్టం

బొండపల్లి: ఇటీవ ఈదురుగాలులతో కురిసిన వర్షాలకు మండలంలోని ముద్దూరు గ్రామంలో 40 ఎకరాల్లో మొక్కజొన్న పంటకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు అంచనా వేశామని ఏఓ పి.వి.మల్లికార్జునరావు తెలిపారు. పలు గ్రామాల్లో 150 ఎకరాల్లో పంటనేలకొరగగా అందులో 33 శాతానికి మించి దెబ్బతిన్న పంట విస్తీర్ణం 40 ఎకరాల వరకు ఉన్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. నివేదికలను ఉన్నతాధికారులకు పంపించామని చెప్పారు.

ఆర్యవైశ్యులకు అండగా ప్రభుత్వం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

- ప్రపంచ ఆర్యవైశ్య సంఘం మహాసభలో ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గజపతినగరం: ఆర్య వైశ్యులకు తమ ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని, పదవుల్లో ఆర్యవైశ్యులకు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తగిన ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. ప్రపంచ ఆర్యవైశ్య సంఘం మహాసభను పురిటిపెంట గ్రామంలోని మారుతీనగర్ వద్ద ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రపంచ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు టంగుటూరి రామకృష్ణ ముఖ్య అతిథిగా, ఎమ్మెల్యే అప్పలనరసయ్య ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. మహాసభను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయ, నామినేటెడ్ పదవుల్లో ఆర్యవైశ్యులకు ముఖ్యమంత్రి పెద్దపీట వేస్తున్నారని అన్నారు. ఆర్య వైశ్య సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్ర స్వామికి డిప్యూటీ స్పీకర్ పదవిని సీఎం కట్టబెట్టారని చెప్పారు. అన్ని రంగాల్లోను సముచిత స్థానం, అవకాశాలు కల్పించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆర్యవైశ్యులకు ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకు వస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రపంచ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రామకృష్ణ మాట్లాడుతూ ఆర్య వైశ్యులు అంతా ఐకమత్యంగా ఉండాలని, సమస్యలు ఏవైనా ఉంటే స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరించుకోవాలని అన్నారు.విజయనగరం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, నాయకులు జూలకంటి శ్రీనివాసరావు,మావుడి సత్యనారాయణ, పూసర్ల మోహనరావు, ఉప్పల ఈశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

రామాలయాల నిర్మాణానికి శంకుస్థాపన



రావివలసలో రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మాజీ ఎంపీ ఝాన్సీలక్ష్మి

చీపురుపల్లిరూరల్: మండలంలోని రావివలస, ముల్లుపేట, అర్థివలస, దేవరాపొదిలాం గ్రామాల్లో రామాలయాల నిర్మాణానికి మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి ఆయా గ్రామాల పెద్దలతో కలిసి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఆలయాల నిర్మాణాలతో ప్రజల్లో ఆధ్యాత్మిక భావం పెరుగుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దేవదాయశాఖ నుంచి ఒక్కో రామాలయ నిర్మాణానికి రూ.10 లక్షలు చొప్పున నిధులను మంజూరు చేసిందని చెప్పారు. ఇది వరకు ఏ ప్రభుత్వమూ చేయని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలయాల నిర్మాణాలకు నిధులను మంజూరు చేస్తున్నారని అన్నారు. గ్రామపెద్దలు, యువత అంతా ఐక్యతతో ఆలయ నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని సూచించారు. ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసులనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, దన్నాన జనార్దన్, కరిమజ్జి శ్రీనివాసరావు, పతివాడ రాజారావు, రామలింగాపురం పీఏసీఎస్ అధ్యక్షుడు పనస అప్పారావు, కర్లాం పీఏసీఎస్ అధ్యక్షుడు చందక గురునాయుడు, ఆయా పంచాయతీల సర్పంచులు రఘుమండ రమణమ్మ, చందక సాయమ్మ, ఎంపీటీసీలు అధికార్ల శ్రీనివాసరావు, మీసాల ఈశ్వరరావు, కొమ్ము పద్మజ, ఆయా పంచాయతీల ఉపసర్పంచులు,నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా గ్రామదేవతల పండగ



వేపాడ: సోంపురంలో దక్షిణ కాళీమాత అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



వేపాడ: వీలుపర్తి లో పైడితల్లమ్మ ఆలయానికి వెళుతున్న భక్తులు



చీపురుపల్లి: భక్తులకు అన్న ప్రసాదం వడ్డిస్తున్న దేవస్థానం కమిటీ

వేపాడ: మండలంలోని వీలుపర్తిలో గ్రామదేవత పైడితల్లమ్మ, సోంపురంలో దక్షిణ కాళీమాత అమ్మవార్ల పండగను గ్రామస్తులు ఆదివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవార్లకు భక్తులు పసుపు, కుంకమ, చీరలతో మొక్కులు చెల్లించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సోంపురంలో సర్పంచ్ మురిపిండి గంగరాజు, ఎంపీటీసీ అకుల సత్యనారాయణ తదితరులు దక్షిణ కాళీమాత అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు బంగారమ్మతల్లి విగ్రహప్రతిష్ఠ

మెరకముడిదాం: మండలంలోని పెదమంత్రిపేటలో గ్రామ దేవత బంగారమ్మతల్లి ఆలయంలో అమ్మవారి విగ్రహ, కలశ ప్రతిష్ఠ సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయం వద్ద మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నామని, గ్రామానికి చెందిన భక్తులతో పాటు చుట్టు పక్క గ్రామాల భక్తులు హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

దిగ్విజయంగా ఏడాది పూర్తి..

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో అన్న సమారాధాన కార్యక్రమం దిగ్విజయంగా ఏడాది పూర్తి చేసుకుందని దేవస్థానం చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్ చెప్పారు. అమ్మవారి దేవస్థానంలో ఆదివారం ఏర్పాటు చేసిన అన్న సమారాధాన కార్యక్రమాన్ని ఎంపీటీసీ ఇప్పిలి సుధారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతేడాది అమ్మవారి 24వ జాతర మహోత్సవాలు పూర్తి చేసుకున్న తరువాత తొలి ఆదివారం నుంచి అన్నదాన కార్యక్రమం ప్రారంభించామన్నారు. అప్పటి నుంచి దాతల సహకారంతో ప్రతీ ఆదివారం కార్యక్రమాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్నామని, వందలాది మంది భక్తులు అమ్మవారి ప్రసాదం స్వీకరిస్తున్నట్లు చెప్పారు. దేవస్థానం ఈఓ జి.శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు వంకల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఉపకార వేతనాలకు ఎంపిక



స్కాలర్ షిప్‌కు ఎంపికైన మెట్టపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు



పెదనడిపల్లి పాఠశాల విద్యార్థిని హరిణి

చీపురుపల్లిరూరల్: జాతీయ ఉపకార వేతనాలకు (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్) మండలంలోని మెట్టపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులు దన్నాన చరణ్‌తేజ్, మీసాల ప్రసన్న, తామరపు తేజ, పెదనడిపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని మీసాల హరిణి ఎంపికయ్యారు. ఉపకారవేతనాల కోసం నిర్వహించిన పరీక్షలో ఈ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ఆదివారం చెప్పారు. ఎంపికైన విద్యార్థులకు 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ పూర్తయ్యే వరకు ఏడాదికి రూ.12వేల చొప్పున కేంద్రప్రభుత్వం స్కాలర్‌షిప్ అందజేయనుందని తెలిపారు. విద్యార్థులను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు అభినందించారు.

ముమ్మరంగా వేసవి దుక్కులు



తమటాడ వద్ద ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

బొండపల్లి: గజపతినగరం సబ్ డివిజన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో రెండు రోజులుగా రైతులు వేసవి దుక్కులు చేయిస్తున్నారు. నాలుగు రోజుల క్రితం సబ్ డివిజన్ పరిధిలోని మెంటాడ, బొండపల్లి, దత్తిరాజేరు, గజపతినగరం మండలాల్లో వర్షాలు కురిశాయి. అదును కుదరడంతో రైతులు ఖరీఫ్‌కు సంబంధించి మెట్టు భూములతో పాటు,పల్లపు భూములను ట్రాక్టర్లతో దున్నిస్తున్నారు. సబ్ డివిజన్ పరిధిలో పల్లపు భూములు 14 వేల హెక్టార్ల వరకు ఉండగా అదే స్థాయిలో మెట్టు భూములు ఉన్నాయి. కొంతమంది రైతులు దుక్కులు చేసి నువ్వుల విత్తనాలను చల్లుతున్నారు. వేసవి దుక్కులతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

నేడు మండల పరిషత్ కార్యాలయంలో స్పందన

దత్తిరాజేరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం సోమవారం ఉదయం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని 35 గ్రామాలకు చెందిన ప్రజలూ తమ సమస్యలపై వినతిపత్రాలు అందించవచ్చని సూచించారు. అన్ని శాఖల మండల అధికారులు, గ్రామ సచివాలయాల డీడీఓలు స్పందనకు హాజరై వినతులు స్వీకరిస్తారని పేర్కొన్నారు.

రూ.20 లక్షలతో భవనాల ఆధునీకీకరణ



మెరకముడిదాం ఎంపీడీఓ కార్యాలయం



కార్యాలయ లోపలి ఆవరణ

మెరకముడిదాం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం రూపురేఖలు మారాయి. ఇక్కడి భవనాలు కొన్ని శిథిలం కావడం, సరైన సదుపాయాలు లేకపోవడంతో అధికారులు, కార్యాలయ సిబ్బంది, పనుల నిమిత్తం వచ్చే ప్రజలు అవస్థలు పడాల్సి వచ్చేది. కనీసం భవనాలకు మరమ్మతులు చేయాలన్న ఆలోచన కూడా నాటి మండల పరిషత్ పాలక వర్గం చేయలేదు. కార్యాలయం దుస్థితిని గుర్తించిన స్థానిక జెడ్పీటీసీ, జిల్లా పరిషత్‌చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు భవనాల ఆధునీకీకరణకు చర్యలు ప్రారంభించారు. భవనాల మరమ్మతులు, సదుపాయాలు మెరుగుపరిచేందుకు మండల పరిషత్ నుంచి రూ.10 లక్షలు, జిల్లాపరిషత్ నుంచి రూ.10 లక్షలు మంజూరు చేయించారు. ఈనిధులతో స్థానిక ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ఎంపీడీఓ పి.రామకృష్ణ పర్యవేక్షణలో మరమ్మతులు, ఇతర పనులు పూర్తి చేశారు. మీటింగ్ హాల్‌లో సమూల మార్పులు చేశారు. హాల్‌లో సీలింగ్, పెయింటింగ్ పనులు చేయించడంతో పాటు సౌండ్‌సిస్టమ్, వీడియో కాన్ఫరెన్స్‌కు అవసరమైన పరికరాలను సమకూర్చారు.కార్యాలయ ఆవరణలో పెద్ద, పెద్ద సమావేశాలకు వీలుగా శాశ్వత స్టేజ్ నిర్మించారు. కార్యాలయం చుట్టూ ఉన్న ఆవరణ మొత్తం మట్టితో చదునుచేయించారు. కార్యాలయం లోపల ఆవరణలో టైల్స్ వేశారు. పూలు, క్రోటాన్స్ మొక్కల కుండీలను అమర్చారు. కార్యాలయాన్ని సుందరంగా తీర్చిదిద్దినందుకు మండల ప్రజాప్రతినిధులు, ప్రజలు అధికారులను, స్థానిక ప్రజాప్రతినిధులను అభినందిస్తున్నారు.

రూ.80 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం



సీసీ రోడ్డు నిర్మించేందుకు మట్టిరోడ్డుపై వేసిన మెటల్

దత్తిరాజేరు: మండలంలోని షికారుగంజి బీటీ రోడ్డులోని ఎస్.చింతలవలస కూడలి నుంచి ఎస్. చింతలవలస గ్రామానికి వెళ్లే మట్టి రోడ్డుకు ఇన్నాళ్లకు మోక్షం లభించింది. గ్రామం నుంచి ప్రధాన బీటీ రోడ్డును అనుసంధానం చేస్తూ ఉన్న ఈ మట్టి రోడ్డును సిమెంట్ రోడ్డుగా మార్చాలని గ్రామస్తులు ఎప్పటి నుంచో పాలకులను, అధికారులను కోరుతున్నారు. గత ప్రభుత్వంలో పాలకులు ప్రజల సమస్యను పట్టించుకోలేదు. తాజాగా ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య సిఫార్సులతో సుమారు కిలోమీటరు మేర సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నాబార్డ్ నిధులు రూ.80 లక్షలు మంజూరు చేసింది. ఇప్పటికే ఓ కల్వర్టు నిర్మాణం పూర్తి చేశామని, మెటల్ పనులు పూర్తయ్యాయని, త్వరలో సీసీ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేస్తామని పీఆర్ డీఈ అప్పలనాయుడు ఆదివారం తెలిపారు. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే అప్పలనరసయ్యకు గ్రామస్తులు, సర్పంచ్ కంది, పద్మావతి, మాజీ ఎంపీపీ తిరుపతినాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గంట్యాడ: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సంబంధిత మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో రామవరం, కరకవలస గ్రామాలకు సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ ప్రసన్న కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

రూపురేఖలు మారాయ్...

- పాఠశాలల అభివృద్ధికి 'నాడు - నేడు' నిధులు
- కోట్లాది రూపాయలు వెచ్చించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం



సుందరంగా రూపుదిద్దుకున్న సుంకరిపేట పాఠశాల ప్రాంగణం

విజయనగరం రూరల్: పాఠశాలల్లో అన్ని సౌకర్యాలతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తే సమాజానికి మెరుగైన విద్యార్థులను అందించవచ్చనే తలంపుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మూడేళ్ల కిందటే 'నాడు - నేడు' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పాఠశాలల అభివృద్ధికి నిధులు కేటాయించి కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దడంతో పాఠశాలల రూపురేఖలు మారాయి. నియోజవర్గ పరిధిలో తొలివిడతలో 43 పాఠశాలలను నాడు - నేడు కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి చేయగా... రెండో విడతలో 51 పాఠశాలలను అభివృద్ధి చేశారు.

టీడీపీ హయాంలో దయనీయం..

2019 సంవత్సరానికి ముందు తెలుగుదేశం పాలనలో నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దయనీయంగా ఉండేది. చాలీచాలనీ తరగతి గదులు, తాగునీటి సమస్యతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎన్నో అవస్థలు పడ్డారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో నిర్మించిన మరుగుదొడ్లు ఏడాది తిరిగేసరికే పాడయ్యాయి. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడేవారు. అసంపూర్తిగా మిగిలిన తరగతి గదులతో విద్యార్థులకు నేలమీద క్లాసులు చెప్పిన సంఘటనలున్నాయి. మండల పరిధిలోని పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు ఉండేవి కావు. మరుగుదొడ్లకు వెళ్లాలన్నా పొలంగట్ల బాట పట్టాల్సిన పరిస్థితి ఉండేది. మధ్యాహ్న భోజనం వంటల నిర్వహణ తరగతి వరండాలోనే నిర్వహించేవారు. ప్రహరీలు లేక కుక్కలు, పశువులు పాఠశాలల ఆవరణలోనే తిష్ట వేసేవి.

'నాడు - నేడు' పనులకు రూ. 13.69 కోట్లు

'నాడు–నేడు' కార్యక్రమంలో భాగంగా తొలి విడతలో నియోజకవర్గంలోని 43 పాఠశాలలను ఎంపిక చేశారు. ఆయా పాఠశాలల్లో అభివృద్ధి పనులకు 7,45,32,000 రూపాయలు మంజూరు చేశారు. అలాగే రెండో విడతలో 51 పాఠశాలలను ఎంపిక చేసి రూ. 6,23,51,000 మంజూరు చేసి అభివృద్ధి పనులతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించారు. కనీస సదుపాయాలు లేని స్థాయి నుంచి కార్పొరేట్ పాఠశాలలను తలదన్నే విధంగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారు. అలాగే సురక్షిత తాగునీరు, అత్యాధునిక మరుగుదొడ్లు, వాటికి రన్నింగ్ వాటర్, గోడలపై విజ్ఞానాన్ని పెంచే బొమ్మలు, అదనపు భవనాలు, ప్రహరీలు వంటివి నిర్మించారు. సోలార్ విద్యుత్ సౌకర్యం, డిజిటల్ తరగతుల నిర్వహణతో పాఠశాలల్లో సకల సౌకర్యాలు కల్పించారు. ప్రతి తరగతి గదిలో ఫ్యాన్లు, విద్యుత్ దీపాలు, ఆధునిక హంగులతో బ్లాక్‌బోర్డులు ఏర్పాటు చేశారు. అలాగే పాఠశాలల ప్రాంగణాల్లో మొక్కలు పెంచుతూ ఆహ్లాదకర వాతావరణాన్ని ఏర్పాటు చేశారు.



సారిక పాఠశాలలో నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లు



పాఠశాలలో ఆధునిక వసతులతో నిర్మించిన మరుగుదొడ్లు



సారికలో సుందరంగా తీర్చిదిద్దిన తరగతి భవనం



సారిక ప్రాథమికోన్నత పాఠశాల ప్రధాన ముఖద్వారం